సాక్షి
పల్నాడు
గురువారం । 23 । మే । 2024




వరాహ లక్ష్మీ నృసింహుని కల్యాణం

తాడేపల్లిరూరల్ :పోలకంపాడులోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది.



త్రికోటేశ్వరునికి మల్లెల అర్చన

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి బుధవారం రాత్రి మల్లెపూల అర్చనను నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు మల్లెలతో అర్చన ఆనవాయితీ.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బంగారు భవిత బాటన

- జిల్లాలో గడప గడపకు భవితా కేంద్రాల ఐఈఆర్‌పీలు
- ఈనెల ఒకటిన ప్రారంభమైన సర్వే జూన్ 9వరకు కొనసాగింపు
- కొత్తగా 75 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు
- వారి ఆరోగ్యం, విద్యపై సర్కారు ప్రత్యేక శ్రద్ధ
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు అందించడానికి కృషి



ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధిస్తున్న ఐఈఆర్‌పీ (ఫైల్)

సత్తెనపల్లి: జిల్లాలో దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో చేరని వారితోపాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సేకరిస్తున్నారు. చదువు వల్ల ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ సర్వేతో ఇప్పటికే కొందరు బడుల్లో చేరేందుకు ముందుకు వచ్చారని చెబుతున్నారు.

విస్తృతంగా గడప గడపకు సర్వే

సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. వీటిపై అవగాహన లేక ఇప్పటికీ అనేక మంది తల్లిదండ్రులు ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. దీని వల్ల ఆ పిల్లల్లో వైకల్యానికి తోడు విద్యాబుద్ధులు లోపించి ఇళ్లలోనే మగ్గిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు గడప గడపకు సర్వేను సహిత విద్య అధికారులు చేపట్టారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఇది ప్రారంభమైంది. ప్రస్తుతం వేసవి సెలవుల సమయాన్ని దీని నిమిత్తం వినియోగిస్తున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి గుర్తించి అందరినీ భవిత కేంద్రాల్లో చేర్చడానికి వీలుగా కార్యాచరణను సిద్ధం చేశారు.

పాఠశాలలకు అనుసంధానం

ఇప్పటికే భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల గల పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంత గానో కృషి చేస్తోంది. ఈ కేంద్రాల్లో వారికి విద్యాబుద్ధులూ నేర్పింది. గత ఏడాది నుంచి భవిత కేంద్రాల సమీప పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య అభ్యసనకు శ్రీకారం చుట్టింది. శారీరక, మానసిక వైకల్యం బారిన పడిన పిల్లలకు తమను ప్రత్యేకంగా విభజించారనే భావన కలగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రాథమిక పాఠశాలల సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించింది. సాధారణ పిల్లలతో కలిసి వీరు విద్యా బుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయన్నది సర్కారు భావన. దీనికోసం మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి భవిత కేంద్రాల బాలలను ఆయా పాఠశాలల్లో విలీనం చేశారు. అక్కడ ఐఈఆర్‌పీలతో పిల్లలకు విద్య బోధిస్తారు. మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు, విద్యా దీవెన వంటి సౌక ర్యాలు కల్పిస్తారు. ఫిజియోథెరపీవ్యాయామం, స్పీచ్ థెరపీ, యోగా అంశాల్లో శిక్షణనిస్తారు.

చేరితే బహుళ ప్రయోజనాలు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు భవిత కేంద్రాల్లో చేరితే బహుళ ప్రయోజనాలు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. చదువుకునే దివ్యాంగులకు ఉచితంగా అవసరమైన అన్ని ఉపకరణాలూ మంజూరవుతాయి. పాఠశాలల్లో చేరే వారికి ప్రతి నెలా రూ.300 చొప్పున రవాణా భత్యాన్ని చెల్లిస్తారు. వినికిడి, దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లు అందజేస్తారు. 9వ తరగతి విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ కం స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైతే ఏడాదికి రూ.12 వేలు చొప్పున వరుసగా నాలుగేళ్లు అందిస్తారు. బాగా రాణించేవారికి ఉన్నత విద్య, ఉపాధికి అవకాశాలు ఉన్నాయి. వైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువ పత్రంతో పింఛన్ లభిస్తుంది. బస్సులు, రైలులో ప్రయాణానికి పాస్ సదుపాయం వర్తిస్తుంది. పాఠశాలకు రాలేని వారి ఇళ్ళకే ఉపాధ్యాయులు వచ్చి అవసరమైన బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలలకు వచ్చినట్లే హాజరు నమోదు అవుతుంది.



రాజుపాలెంలో సర్వే చేస్తున్న ఐఈఆర్‌పీ

పల్నాడు జిల్లాలో ఇలా..

భవిత కేంద్రాలు	: 28
ప్రస్తుతం ఉన్న విద్యార్థులు	: 324 మంది
కొత్తగా గుర్తించిన చిన్నారులు	: 75 మంది
ఐఈఆర్‌పీలు	: 56 మంది
ఆయాలు	: 28 మంది
ఫిజియోథెరపిస్టులు	: ఆరుగురు
సర్వే	- జూన్ 9 వరకు

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నాం



జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడంలో ఐఈఆర్‌పీలు నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు కొత్తగా 75 మందిని గుర్తించాం. దివ్యాంగులు బడిబాట పట్టేలా సర్వే ముమ్మరం చేశాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్య బోధిస్తారు. వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం. ప్రత్యేక అవసరాల పిల్లలను చైతన్యపరిచి భవిత కేంద్రాలకు రప్పించి అక్కడ విద్యాబుద్ధులు నేర్పించడమే లక్ష్యం.

– కె.శ్రీనివాసరావు, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కో–ఆర్డినేటర్, పల్నాడు

ఒకటి నుంచి దూరవిద్య టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో దూరవిద్య టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు జరగనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు జిల్లాలోని ఏఐ సమన్వయకర్తలతోపాటు ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడంతోపాటు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఏఐ సమన్వయకర్తలు చర్యలు చేపట్టాలని డీఈవో పి.శైలజ, ప్రభుత్వ పరీక్షల విభాగ సహాయ కమిషనర్ కె.వెంకటరెడ్డి ఆదేశించారు.

నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు చార్జిమెమో

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ రాధికకు చార్జి మెమో ఇస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నర్సింగ్ విద్యార్థుల నుంచి యూనిఫామ్, పుస్తకాల కోసం రూ.8వేలు వసూలు చేసినట్లు ఆమెపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఆమె పనిచేయడంతో చార్జి మెమో ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా నర్సింగ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ తీరుపై గతంలో పలు మార్లు విద్యార్థులు ఫిర్యాదులు చేశారు.

నర్సింగ్ కాలేజీలోనూ ఇదే తీరు

గోరంట్లలోని ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కాలేజీలో కూడా విద్యార్థుల వద్ద నుంచి పుస్తకాలు, యూనిఫామ్ నిమిత్తం రూ. 9వేల వరకు వసూలు చేసినట్లు విద్యార్థులు చెబుతున్నారు. కళాశాలలో ఫ్రెషర్స్‌డే, ఫేర్‌వెల్ డే, ఇతర కార్యక్రమాల కోసం బలవంతంగా తమ వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

న్యూస్‌రీల్

డీఫార్మసీ కోర్సులో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాల పరిమితి గల డీ ఫార్మసీ కోర్సులో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపునకు జూన్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ రెగ్యులర్‌తోపాటు దూరవిద్య ద్వారా బైపీసీ, ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థినులు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డు నుంచి తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆదాయ ధ్రువీకరణపత్రం/తెల్ల రేషన్ కార్డు కలిగిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా అడ్మిషన్ ఫీజు మినహాయింపుతో పాటు ఉపకార వేతనాలకు అవకాశం కలదని తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి ఉందని, ఆసక్తి గల విద్యార్థినులు అన్ని సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, దరఖాస్తు రుసుం రూ.400తో కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 98480 38769, 99593 24563, 93986 20953 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ కౌంటింగ్ ఏజెంట్లను అడ్డుకునే కుట్ర

ఎమ్మెల్యే గోపిరెడ్డి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ కాకుమాను

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండే వారిని అడ్డుకోవడానికి కుట్ర జరుగుతోందని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ కాకుమాను బాలహనుమంతరెడ్డి బుధవారం వెల్లడించారు. కౌంటింగ్ ఏజెంట్ల నేర చరిత్ర పరిశీలించి సర్టిఫికెట్ చేస్తామని పోలీస్ శాఖ చెప్పడం తగదని పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 కింద, కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల్లో ఎక్కడా అలాంటి రూల్ లేదని పేర్కొన్నారు. కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకునే అధికారం పార్టీలకు ఉందని స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులిచ్చే అధికారం రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఉంటుందని, ఇందులో పోలీసుల ప్రమేయమేమీ ఉండదని వివరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన నరసరావుపేట నియోజకవర్గస్థాయి ఆల్ పార్టీ సమావేశంలోనూ ఈ ప్రశ్న లేవనెత్తానని వివరించారు.

హత్యాయత్నం కేసులో బీజేపీ పట్టణ కన్వీనర్ అరెస్ట్

పోలింగ్ రోజు దాడుల్లో అరవిందబాబుతో పాల్గొన్న రామకృష్ణ

నరసరావుపేట టౌన్: పోలింగ్ రోజు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి దాడుల్లో పాల్గొన్న బీజేపీ పట్టణ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించారు. పోలింగ్ రోజు మున్సిపల్ బాలుర పాఠశాల ఎదుట ఏరియా వైద్యశాల వద్ద నిల్చొని ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కారు డ్రైవర్ చట్టి మహేంద్రపై అరవిందబాబు, రంగిశెట్టి రామకృష్ణ మరి కొందరు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఎన్నికల కమిషన్ నియమించిన సిట్ బృందం నిందితులను గుర్తించింది. కేసులో రామకృష్ణను ఇప్పటికే అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

నేటి నుంచి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్

నరసరావుపేట: ఈనెల 23 తేదీ గురువారం పల్నాడు జిల్లాలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి బుధవారం పేర్కొన్నారు. 60 ఏళ్లకు పైబడిన వారు, షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారు, ఐదేళ్లలోపు క్షయ వ్యాధికి గురైనన వారు, రెండేళ్ల లోపుగా క్షయ వ్యాధిగ్రస్తునితో కలిసి నివసించిన వారు, బాడీ మాస్ ఇండెక్స్ 18 లోపు ఉన్నవారు, పొగ తాగే అలవాటు ఉన్నవారు అడల్ట్ బీసీజీ టీకా వేయించుకోవచ్చని, సమీప ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.4,200, మోడల్ ధర రూ.5,100 వరకు పలికింది.

అభ్యర్థులు సహకరించాలి



కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్

- ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు ఆస్కారమివ్వద్దు
- ఏ కేసులూ లేనివారికే కౌంటింగ్ ఏజెంట్లుగా అనుమతి
- పోస్టల్ బ్యాలెట్ల తర్వాతనే ఈవీఎంల ఓట్లు లెక్కింపు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు అధికారులకు సహకరించాలని, జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లత్కర్ విజ్ఞప్తి చేశారు. సంయమనం పాటించాలని అభ్యర్థులు తమ కార్యకర్తలకు సూచించాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రధాన పార్టీలు ఏజెంట్ల నియామకానికి ఫామ్–18 రెండు సెట్లను అందించాలని సూచించారు. ఒక సెట్‌ను పోలీస్ విభాగానికి పంపించి పూర్వాపరాలను తనిఖీ చేయిస్తామని వెల్లడించారు. ఎటువంటి కేసులూ లేని వారిని మాత్రమే ఏజెంట్లుగా అనుమతిస్తామని స్పష్టం చేశారు. జేఎన్టీయూ కౌంటింగ్ కేంద్రం చుట్టూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని, 100 మీటర్లలోపు ఎవరి వాహనాలకూ అనుమతి లేదని వివరించారు. గుర్తింపు కార్డులు ఉంటేనే లోపలకు అనుమతి ఉంటుందని వెల్లడించారు. జేఎన్టీయూ మెయిన్ గేటు వద్ద పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసి, అన్ని స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి సీసీ కెమెరాల ద్వారా అనుసంధానించామని వివరించారు. పోస్టల్ బ్యాలెట్లన్నింటినీ జూన్ 3న కట్టుదిట్ట భద్రత నడుమ కౌంటింగ్ సెంటర్‌కు తరలిస్తామని వివరించారు. రెండురోజుల్లో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతుల గురించి వివరించారు. ముందు పోస్టల్ బ్యాలెట్లు లెక్కించిన తర్వాత ఈవీఎంలలో ఓట్లు లెక్కిస్తారని వెల్లడించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి, పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్‌కు అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున, మాచర్ల, సత్తెనపల్లి నియోజకవర్గాలకు మూడు చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు 18 టేబుళ్లను ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మోగిన సంగీత సిరిమువ్వలు

- రెండోరోజూ వైభవంగా సంగీత నాట్య పోటీలు
- ప్రతిభతో అబ్బుర పరిచిన కళాకారిణులు



అర్ధూరుకు చెందిన సానిధ్య యశోద ప్రదర్శన



జగిత్యాలకు చెందిన నిత్యశ్రీ వినాయకకౌతం



గుంటూరుకు చెందిన తన్వి శరణంభవ ప్రదర్శన



జగిత్యాలకు చెందిన శ్రీకృతి గణపతికౌతం

చిలకలూరిపేట: కళానిలయం 39వ జాతీయ స్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలు బుధవారం రెండోరోజు వైభవంగా సాగాయి. పోటీలకు వేదికైన పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో భరతనాట్యం, కూచిపూడి పోటీలు అట్టహాసంగా సాగాయి. చంద్ర, సూర్య విభాగాలలో కళాకారిణులు సత్తాచాటారు. కళాప్రియులకు సంగీత సిరిమువ్వల మాధుర్యాన్ని పంచారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కాళ్లకు గజ్జెలు కట్టి, చక్కటి హావభావాలతో పోటాపోటీగా ప్రతిభ చూపారు. కీర్తన, మూషిక వాహన, గణపతికౌతం, వినాయకకౌతం, ముద్దుగారే యశోద, బాలగోపాల తరంగం, బ్రహ్మాంజలి, దశావతారశబ్దం, జనుతశబ్దం, కొండలలో నెలకొన్న, భామాకలాపం, నరసింహవైభవం, హిమగిరి తనయ, అలవేల్ మంగ వంటి పాటలకు లయబద్ధంగా నర్తించారు. ప్రేక్షకులను రంజింపచేశారు. కరతాళధ్వనులు అందుకున్నారు. ఓ వైపు పోటీలు కొనసాగిస్తూనే మరోవైపు నాట్యాచార్యులను సన్మానించారు. ముందుగా కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణి ప్రగడ శివసత్యనారాయణమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి పూజ నిర్వహించారు.

నేటికార్యక్రమాలు

కళానిలయం 39వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలలో భాగంగా గురువారం చంద్ర, సూర్య విభాగాల్లో జానపద నృత్య పోటీలతోపాటు శాస్త్రీయ జంటనాట్యాలు, శాస్త్రీయ బృంద నాట్యాలు, శాస్త్రీయం కాని బృంద నాట్యాలు, శాస్త్రీయ నృత్య నాటికల పోటీలు నిర్వహిస్తారు. వీటితోపాటు నాట్యాచార్యులకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయి.



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది



ఆందోళనకారులను నియంత్రిస్తున్న ప్రత్యేక దళాలు

భద్రతా చర్యలపై మాక్‌డ్రిల్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం సమీపిస్తున్న తరుణంలో పోలీసులు భద్రతా చర్యలపై దృష్టి సారించారు. ఈక్రమంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈస్ట్ సబ్‌డివిజన్ ఏఎస్పీ నిచికేత్ షలేకే, లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఏదైనా అనుకోని ఘటన జరిగిన నేపథ్యంలో, హింసాత్మక చర్యలకు పాల్పడినప్పుడు ఎలా స్పందించాలనే అంశాలపై సిబ్బంది విన్యాసాలు చేశారు. లాఠీచార్జి, వాటర్ కెనాన్ ప్రయోగం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, ఫైరింగ్‌పై డెమో నిర్వహించారు. జాగిలాలతో విన్యాసాలు చేయించారు. శాంతిభద్రతల రక్షణలో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించామని, కౌంటింగ్ సందర్భంగా ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని పోలీసు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనోజ్ హెగ్డే, కొత్తపేట, పాతగుంటూరు సీఐలు షేక్ అన్వర్‌బాషా, రమేష్‌బాబు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ బి.కోటేశ్వరరావు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆందోళనకారులను వాటర్ కెనాన్‌తో అడ్డుకునే దృశ్యం

టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి సర్వంసిద్ధం

- రేపటి నుంచి పరీక్షలు
- ఎస్ఎస్సీ, ఇంటర్ బోర్డు సైట్లలో హాల్ టికెట్లు
- టెన్త్ పరీక్షలకు హాజరు కానున్న 6,373 మంది
- ఇంటర్ పరీక్షలకు 17,776 మంది
- పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24 శుక్రవారం నుంచి జరగనున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అధికారులు పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను డీజీఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌తోపాటు ఇంటర్ హాల్ టికెట్లను బీఐఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్లలో అందుబాటులో ఉంచారు. వాటిని విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకుని, నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చు.

టెన్త్ పరీక్షలకు 27 పరీక్ష కేంద్రాలు

ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు జరగనున్న 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 6,373 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 27 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. 27 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు సహా 280 మంది ఇన్విజిలేటర్లను విద్యాశాఖాధికారులు నియమించారు. ఈనెల 24 నుంచి జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 17,776 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండియర్ పరీక్షలు జరగనున్నాయి.

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గుంటూరు కృష్ణనగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి, కృష్ణాజిల్లా నందివాడ మండలం తమిరిసలోని ఉమా స్పింటెక్స్ ప్రైవేటు లిమిటెడ్, ఒంగోలులోని ఈఎస్ఈసీ బ్రాంచ్, విజయవాడ గాంధీనగర్‌లోని ఈఎస్ఈసీ బ్రాంచ్ కార్యాలయం, బాపట్ల జిల్లా కారంచేడులోని శ్రీసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం తిమ్మాపురంలోని వసంత ఇండస్ట్రీస్‌లో కార్యక్రమాలు జరగనున్నాయని వివరించారు.

క్లుప్తంగా

వ్యక్తి దారుణ హత్య



గుంటూరు ఈస్ట్: నడిరోడ్డుపై వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కంచర్ల దేవదానం (33) ప్రకాశం జిల్లా కురిచేడులో నివాసం ఉంటున్నాడు. ఎన్నికల సమయంలో గుంటూరు వచ్చి సంజీవయ్యనగర్ 1వలైనులో మకాం పెట్టాడు. అతని సమీప బంధువుకు డబ్బులు అప్పుగా ఇచ్చాడు. ఈ నేపథ్యంలో దేవదానం సమీప బంధువును తరచూ డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. సమీప బంధువు దేవదానాన్ని చంపుతానని బెదిరిస్తూ వచ్చాడు. బుధవారం దేవదానం కొందరితో కలిసి వసంతరాయపురంలోని సాయిసుధా బార్‌కు వెళ్లి మద్యం సేవించారు. అందరూ కలిసి కారులో సంజీవయ్యనగర్ 2వ లైనుకు వచ్చారు. కంచర్ల దేవదానం మూత్ర విసర్జన చేయడం కోసం కారు ఆపి కిందకు దిగాడు. మూత్ర విసర్జన అనంతరం కారులోని మిగిలిన వారు కత్తులతో దేవదానంపై దాడిచేసి హత్య చేశారు. దేవదానం ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వెస్ట్ డీఎస్పీ మహేష్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

లక్ష్మీపురం: రైల్వే స్టేషన్‌లలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న యువకుడిని గుంటూరు పశ్చిమ పరిధిలో జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. గుంటూరు రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు గుంటూరు రైల్వే జీఆర్పీ డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రమేష్, వెంకటాద్రి, ఖాదర్ బాషా గుంటూరు పశ్చిమ పరిధిలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో ఓ యువకుడు పోలీసులను చూసి పరారైయ్యే ప్రయత్నం చేశాడు. దీన్ని గమనించిన పోలీసులు వెంటపడి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఆ యువకుడు గుంటూరు స్తంభాలగరువు ప్రాంతానికి చెందిన అక్కిశెట్టి ఆకాష్‌గా గుర్తించారు. చెడు వ్యసనాలను అలవాటు పడి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి వాటిని విక్రయించగా వచ్చిన నగదుతో జల్సాలు చేస్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. దీంతో అతడి వద్ద ఉన్న సుమారు రూ.2.45 లక్షల విలువ చేసే 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ మలికా గార్గ్



పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్

రెంటచింతల: జిల్లాలోని సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. మంగళవారం మండలంలోని పాల్వాయి గేటు, తుమ్మకోట గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి పరిశీలించారు. ఆయా గ్రామాలలో ఈవీఎంలు ధ్వంసమైన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికా గార్గ్ అక్కడ ఏర్పాటు చేసిన పికెట్‌లోని పోలీస్ సిబ్బందికి బందోబస్తుకు సంబంధించి పలు సూచనలు చేశారు. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎక్కడా అల్లర్లు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హింసాత్మక ఘటనలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలు ప్రాంతాల్లో పోలీసుల కార్డన్ సెర్చ్

సత్తెనపల్లి: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని రాజుల కాలనీ, చెంచు కాలనీల్లో పట్టణ పోలీసులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గృహాలు, పాడుబడిన ఇళ్లు, పాకలలో విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం. సత్యనారాయణ, పోలీసులు, మహిళా పోలీసులు, ఉన్నారు.



పాత గణేశునిపాడులో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

పాత గణేశునిపాడులో..

పిడుగురాళ్లరూరల్: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు మండలంలోని పాతగణేశునిపాడు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటిని ముమ్మరంగా తనిఖీ చేశామన్నారు. నెంబర్ ప్లేట్ లేని, సరైన రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్, ఏఎస్ఐలు కొండలరావు, ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ చలో మాచర్లకు అనుమతిలేదు

నరసరావుపేట: తెలుగుదేశం పార్టీ గురువారం చేపట్టిన ఛలో మాచర్ల కార్యక్రమానికి ఎటువంటి అనుమతిలేదని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున టీడీపీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సదరు కార్యక్రమంలో పాల్గొనటం, ర్యాలీగా వెళ్లటం చెయ్యకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా జేసీ, నియోజక వర్గ ఆర్‌ఓ శ్యాం ప్రసాద్

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాం ప్రసాద్ తెలిపారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, మొదటగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల లెక్కింపు వేర్వేరు చోట్ల 14 టేబుళ్లలో జరుగుతుందన్నారు. సంబంధిత పార్టీ అభ్యర్థులు 15 మంది ఏజెంట్లకు అనుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. కౌంటింగ్‌కు వచ్చేవారు సెల్‌ఫోన్, ఇతర నిషేధిత వస్తువులు తీసుకురాకూడదన్నారు. స్ట్రాంగ్ రూం అభ్యర్థుల, ప్రతినిధుల సమక్షంలో ఓపెన్ చేసి కౌంటింగ్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. తహసీల్దార్ మంజునాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ షేక్ బాషా, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ బూత్‌ల కన్వీనర్ కుర్రా వెంకటేశ్వరరావు, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ ఎ.శ్యాం ప్రసాద్

దైవ దర్శనానికి వెళుతూ అనంతలోకాలకు..

- ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి
- మరో ఐదుగురికి గాయాలు

అచ్చంపేట: ఆటోలో దైవదర్శనానికి వెళుతూ ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలైన ఘటన మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధిలోగల బొగ్గువాగు మలుపులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన 12 మంది ఆటోలో తెలంగాణ రాష్ట్రంలోని హుజూర్‌నగర్ మండల పరిధిలోగల మట్టపలి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బయలు దేరారు. అచ్చంపేట దాటి తాడువాయి సమీపంలోని బొగ్గువాగు మలుపులో అదుపుతప్పి ఆటో పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న నడికుదురు చినవెంకటేశ్వర్లు(70)తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య చినవీరవర్ధనకు తీవ్ర గాయాలయ్యాయి వారితో పాటు వారి బంధువులు వెంకట్రావమ్మ, నాగరాజు, నాగేంద్రమ్మ, వీరకుమారిలకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు బాధితులను 108వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అచ్చంపేట సీఐ షేక్ కరిముల్లాషావలి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సతెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.



మృతుడు చినవెంకటేశ్వర్లు

బాలుడికి కృత్రిమ చేతులు

రోటరీ క్లబ్ చేయూత



విద్యుత్ షాక్‌తో రెండు చేతులో కోల్పోయిన షమీ



రెండు కృత్రిమ చేతులు అమర్చిన అనంతరం మంగళగిరి రోటరీ క్లబ్ సభ్యులతో షమీ

తాడేపల్లిరూరల్: ఆపదలో ఉన్న స్నేహితుడిని కాపాడబోయి విద్యుదాఘాతంతో రెండు చేతులూ కోల్పోయిన బాలుడికి మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కృత్రిమ చేతులు అమర్చారు. మరికొందరికి కృత్రిమ అవయవాలు అందించారు. మంగళగిరి రోటరీ క్లబ్ చైర్మన్‌అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ సర్వీస్ ప్రాజెక్ట్ మంగళకరం 2024 జెమ్ ఎంఈ1 హ్యాండ్స్, కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ కార్యక్రమంలో భాగంగా జర్మనీ నుంచి విచ్చేసిన క్రిస్ గల్లి నిపుణుల బృందం కృత్రిమ చేతులను అమరుస్తోందని, సుమారు 300 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీకి సన్నాహాలు చేశామని వివరించారు.

గాలిపటం ఎగరేస్తుండగా ప్రమాదం

తెలంగాణ రాష్ట్రం, వికారాబాద్ జిల్లా, పరిగి వివేకానంద విగ్రహం సెంటర్‌కు చెందిన మహమ్మద్ రఫీఖ్ పాషా, రేష్మా బేగం కుమారుడు షమీ 2019 డిసెంబర్ 8న తన స్నేహితుడు జహీర్‌తో కలిసి ఇంటి వద్ద గాలిపటం ఎగురవేస్తున్న క్రమంలో 11 కేవీ హై టెన్షన్ వైర్‌కు గాలిపటం చిక్కుకోగా, జహీర్ ఇనుపరాడ్డుతో గాలిపటాన్ని తీయబోయి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో షమీ అతడిని కాపాడబోయి తనూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ దుర్ఘటనలో షమీ కోమాలోకి వెళ్లి 22 రోజుల అనంతరం కోలుకున్నాడు. రెండు చేతులూ కోల్పోయాడు. దీంతో రోటరీ క్లబ్ సాయంతో షమీకి చేతులు అమర్చారు.

పాముకాటుతో కౌలు రైతు మృతి

బల్లికురవ: పొలం నుంచి పశువుల మేత కోసుకుని వస్తుండగా పాము కాటు వేయడంతో కౌలు రైతు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని కొప్పరపాడు సుగాలి తండాలో జరిగింది. తండా వాసులు, పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. భూక్యా రమేష్ నాయక్ (44) తండాకు దక్షిణ భాగంలో 99 సెంట్ల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. అందులో బెండ, పశుగ్రాసం సాగు చేపట్టాడు. సాయంత్రం బెండతోటకు మందుకొట్టి, పశువులకు మేత కోసుకుని ఇంటికి వస్తున్నాడు. చీకట్లో రోడ్డుకు అడ్డుగా పడుకున్న పామును పొరపాటున తొక్కడంతో కాటు వేసింది. ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశాడు. హుటాహుటిన చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈలోపే రమేష్ నాయక్ మృతి చెందాడు. అతడికి భార్య దేవిబాయి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం తండ్రి కోటా నాయక్ బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకున్నారు. అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అందరితో కలివిడిగా ఉండే రమేష్‌నాయక్ పాము కాటుతో చనిపోవడంతో తండాలో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కంటైనర్‌ను ఢీకొన్న ట్యాంకర్

- ట్యాంకర్ క్యాబిన్‌కు అంటుకున్న మంటలు
- డ్రైవర్ సజీవ దహనం



మంటల్లో కాలిపోతున్న ట్యాంకర్

మేదరమెట్ల: ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ట్యాంకర్ బలంగా ఢీకొన్న సంఘటనలో డ్రైవర్ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమైన సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల పైలాన్‌పై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కృష్ణపట్నం పోర్టు నుంచి పేరేచర్లలో గల జోసిల్ సోప్స్ కంపెనీకి సోప్ ఆయిల్ లోడుతో ట్యాంకర్ బయలుదేరింది. మేదరమెట్ల పైలాన్ వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో దానిపై నిలిపి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో ట్యాంకర్ క్యాబిన్‌కు ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ అందులోనే సజీవదహనమయ్యాడు. మృతుడు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలం ఇనమనమడుగు గ్రామానికి చెందిన కొట్లూరి శ్రీధర్ (40)గా పోలీసులు గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మేదరమెట్ల ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.



శ్రీధర్ (ఫైల్)

గడువు ముగిసిన విత్తనాలు గుర్తింపు

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గడువు ముగిసిన విత్తనాలను విక్రయించే పలు దుకాణాలపై విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొరడా ఝుళిపించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల ప్రకారం.. బుధవారం గుంటూరు రాజగారితోటలోని పలు విత్తన దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి శారదా పరమేశ్వరి ఏజెన్సీస్, తరుణ్ హైబ్రీడ్ సీడ్స్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. శారదా పరమేశ్వరి ఏజెన్సీస్‌లో గడువు ముగిసిన రూ.36 వేలు ఖరీదు చేసే హైబ్రీడ్ మిర్చి, కూరగాయల విత్తనాల (14.22 కిలోలు)ను గుర్తించారు. దీంతో విత్తనాలను సీజ్ చేసి, దుకాణ యాజమానిపై 6–ఎ కేసు నమోదు చేయాలని స్థానిక వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. తరుణ్ హైబ్రీడ్ సీడ్స్ దుకాణంలో 'సోర్సు ధ్రువీకరణ పత్రం' లేకుండా ఉన్న రూ.2.58 లక్షల విలువ చేసే 2 కిలోల హైబ్రీడ్ మిరప విత్తనాలను గుర్తించారు. దీంతో విత్తన విక్రయాలను నిలుపుదల చేయాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారితో నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ రమణకుమార్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, ఏఓ బి.అంజిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ విజయవంతం



కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేస్తున్న వైద్య బృందం

చెరుకుపల్లి: మండలంలోని గూడవల్లిలో ఉన్న కేవీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, డాక్టర్ కొమ్మారెడ్డి రాజారామ్మోహనరావు ఐ హాస్పిటల్‌లో బుధవారం నిర్వహించిన కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ (నల్లగుడ్డు మారిడి) విజయవంతం అయినట్లు వైద్య బృందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. డాక్టర్ అరవిందరామ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రేయాచంద్ర, డాక్టర్ బన్సీ సింఘాలా బృందం ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్లు పేర్కొంది. వీరికి వైద్యశాల డాక్టర్ బృందం వీరవల్లి వాసుబాబు, ఎస్.పిచ్చిరెడ్డి, ఎం.రవిచంద్ర, వై.వెంకట్, ఎస్.రంజిత్ కృతజ్ఞతలు తెలిపారు.

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాకు రెడ్ కార్పెట్

తెనాలిఅర్బన్: ఫ్రాన్స్ దేశంలో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమాకు రెడ్ కార్పెట్ వేయటం భారత పౌరులు గర్వించదగిన విషయమని మా ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకులు దిలీప్‌రాజా పేర్కొన్నారు. తెనాలిలోని రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా చలన చిత్ర నైపుణ్యాల ప్రదర్శనలో ప్రసిద్ధి చెందిన కేన్స్‌లోని అంతర్జాతీయ వేదికపై భారత చిత్రాలకు గౌరవం లభించటంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముస్తాజుబుద్దీన్ మాలిక్ దర్శకత్వంలో రూపొందిన గాడ్ మస్ట్ డై చిత్రంలో సాక్షాత్తు దేవుడిని చంపటం ఊహించలేని కథాంశంగా పేర్కొంటూ ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారితీసిందంటే హాలీవుడ్ స్థాయికి భారతీయ సినిమా ఎదిగిందనటంలో ఎటువంటి సందేహం లేదన్నారు. సినిమాలో హీరోగా నటించిన సందీప్ కర్తార్ సింగ్‌కు కేన్స్‌లో రెడ్ కార్పెట్ వేయటం మర్చిపోలేని అనుభూతిగా అభివర్ణించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ తీర్మానం చేసినట్లు ప్రకటించారు. సమావేశంలో మా ఏపీ సంయుక్త కార్యదర్శి మిలిటరీ ప్రసాద్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటీవ్ మునిపల్లె శ్రీకాంత్, నటుడు బెల్లంకొండ వెంకట్, మన్నె సత్యనారాయణ చౌదరి, ఇంటూరి విజయభాస్కర్, వెంకీ రావణ్ పాల్గొన్నారు.